క్లుప్తంగా

కల్లూరు విద్యార్థికి బంగారు పతకం



శశిధర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న డీఈఓ

కల్లూరు: జిల్లాస్థాయి ఇంగ్లిష్ ప్రతిభాపాటవ పరీక్షలో కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి శశిధర్ బంగారు పతకం గెలుచుకున్నాడు. మండల స్థాయిలో నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా స్థాయిలో పరీక్ష నిర్వహించగా, శశిధర్ మొదటి స్థానంలో నిలిచాడు. ఈసందర్భంగా ఆయనకు డీఈఓ సోమశేఖరశర్మ బంగారు పతకం అందజేయగా, హెచ్‌ఎం గడిపర్తి మాధవరావు, ఉపాధ్యాయులు టి.వీరస్వామి, మేడరాజు శ్రీనివాసరావు, ఐ.వీ.రాజు అభినందించారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

తల్లాడ: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని తల్లాడ ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, ఎస్సై సురేష్ అన్నారు. తల్లాడ మండలం పినపాక గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ చక్కటి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీకాంత్, సతీష్, సీహెచ్‌ఓ భాస్కర్, సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, రాజేశ్వరీ, గ్రామ కార్యదర్శి సుదీర్, ఎఎన్‌ఎం శారద తదితరులు పాల్గొన్నారు.

గోపాలమిత్ర సంఘం ఉపాధ్యక్షుడిగా కృష్ణయ్య



బొడ్డు కృష్ణయ్య

వైరా: గోపాలమిత్రల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వైరాకు చెందిన బొడ్డు కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు రాంబాబు యాదవ్ నియామక పత్రాన్ని అందించారు. హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ గోపాల మిత్రల రాష్ట్ర కమిటీ సమావేశంలో బుధవారం కృష్ణయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో గోపాల మిత్రల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

స్థల పరిశీలన

ముదిగొండ: ముదిగొండలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 30పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ఇటీవల ఖమ్మం పర్యటనకు వచ్చిన ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావుకు జెడ్పీటీసీ సభ్యురాలు పసుపులేటి దుర్గ వినతిపత్రం అందించారు. ప్రభుత్వ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బుధవారం ముదిగొండలో జిల్లా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎర్రవెంకన్న, పసుపులేటి వెంకట్, మల్లయ్య, వైద్యాధికారిణి అరుణదేవి పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి

పెనుబల్లి: ఏజెన్సీ చట్టాలపై 1/70 చట్టాన్ని, పీసా చట్టాన్ని అధికారులు పకడ్బంధీగా అమలు చేయాలని లంబాడ హక్కుల సంఘం జిల్లా నాయకుడు ధర్మసోతు దశరథనాయక్ డిమాండ్ చేశారు. బుధవారం పెనుబల్లిలో జరిగిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించినప్పటికీ అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో కృష్ణ నాయక్, పృథ్వినాయక్, కేశవ నాయక్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి పంటల పరిశీలన

కల్లూరు రూరల్: మిర్చి పంటకు నల్లపోడు తెగులు వలన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని కాంగ్రెస్ సెల్ మండలాధ్యక్షుడు శీలం బ్రహ్మారెడ్డి అన్నారు. మండలంలోని పేరువంచ, ముగ్గు వెంకటాపురం గ్రామాల్లోని మిర్చి తోటలను పరిశీలించి మాట్లాడారు. నల్లపోడు తెగులుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, వెంకటకృష్ణ, వెంకటరెడ్డి, పాశం నాగేశ్వరరావు, రామయ్య, శ్రీను, మునిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వితరణ

కల్లూరు రూరల్: మండలంలోని వెంకటాపురం ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలకు దాతలు రూ.1.50లక్షలు వితరణ చేశారు. పాఠశాలలో హిందీ టీచర్ సునీత మురళి సేకరించిన సొమ్ముతో 55 ఇంచుల టీవీ, విద్యార్థులకు దుస్తులు తదితర వస్తువులను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం శోభన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు దుస్తులు, బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీరవెల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, హెచ్‌ఎం మార్కు, ఎంఈఓ ప్రసాద్, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో ప్రగతి పరుగు

- రూ.80 లక్షలతో కల్లూరు సొసైటీ, గోదాముల నిర్మాణం
- 65 ఏళ్ల తరువాత సొంత స్థలంలో భవనాల ఏర్పాటు
- ఎమ్మెల్యే సండ్ర కృషితో.. నాబార్డు నిధులు



కల్లూరులో నిర్మిస్తున్న సొసైటీ నూతన భవనం, గోదాం

కల్లూరు: 65 ఏళ్ల తర్వాత కల్లూరు విశాల సహకారం పరపతి సంఘానికి స్థలం, నూతన భవనాలకు నాబార్డు నిధులు రూ.80 లక్షలు మంజూరు అయ్యాయి. దీంతో కల్లూరు సొసైటీకి అద్దె భవనాలలో ఉంటే సమస్య తొలిగిపోయింది. 1958, సెప్టెంబర్ 21న కల్లూరులో ప్రారంభమైన సొసైటీకి ఇంత వరకు సొంత స్థలం లేక పోవడంతో అద్దె భవనాలలోనే నెట్టుకు రావాల్సిన పరిస్థితి ఉండేది. కల్లూరు సొసైటీ చైర్మన్‌గా బోబోలు లక్ష్మణరావు వచ్చిన తర్వాత సమస్యను ఎమ్మెల్యే సండ్ర దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారుల దృష్టికి, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించి నాబార్డు నిధులు మంజూరుకు కృషి చేశారు. దీంట్లో సొసైటీ కంట్రీబ్యూషన్ రూ.12 లక్షలు ఉండగా రూ.68 లక్షలు నాబార్డు నుంచి అందాయి. సొసైటీ భవనంతో పాటు 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాము నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సొసైటీ 13 గ్రామ పంచాయతీల పరిధిలో 9 రెవెన్యూ గ్రామాలు, 22 గ్రామాలు ఉన్నాయి. కల్లూరు, బత్తులపల్లి, కప్పలబంధం, పుల్లయ్యబంజర్, తూర్పు లోకవరం, పడమర లోకవరం, కిష్టయ్య బంజర్, హనుమాతండా, పాయపూర్, ముచ్చవరం, యజ్ఞనారాయణపురం, ఓబులరావు బంజర పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 10,487 మంది సభ్యులు ఉండగా 1,552 మంది రైతులు రుణాలు తీసుకున్నారు. టర్నోవర్ వచ్చేసి ఏడాదికి రూ.9 కోట్లు ఉంది. ఈ సొసైటీ ఖరీఫ్‌లో 5 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 1,300 మంది రైతుల నుంచి 1,00,400 క్వింటాళ్ళ ధాన్యం సేకరించి రూ.20.68 కోట్ల మేరకు రైతుల ఖాతాలో నగదు జమ చేసింది. ప్రతీ ఖరీఫ్, రబీ పంటల సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. రైతులకు ఎరువులు, విత్తనాలు రాయితీపై అందజేస్తూ రైతుల సేవలో కల్లూరు సొసైటీ అభివృద్ధి చెందింది.

ఎమ్మెల్యే సండ్రకు కృతజ్ఞతలు



65 సంవత్సరాల నుంచి అద్దె భవనాల్లో ఉంటున్న కల్లూరు సొసైటీకి నిధులు మంజూరు కావడంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కృషి, చొరవ ఎంతగానో ఉంది. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి నిధులు మంజూరుకు కృషి చేశారు. ప్రభుత్వం స్థలం 10 కుంటలతో పాటు రూ.80 లక్షలు మంజూరు అయ్యేలా చేశారు. కావున సొసైటీ తరుపున ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు కృతజ్ఞతలు.

– బోబోలు లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్, కల్లూరు

పేదింటి ఆడపడుచులకు పెద్దన్న కేసీఆర్



షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: తెలంగాణలోని పేదింటి ఆడపడుచులకు పెద్దన్నగా సీఎం కేసీఆర్ నిలిచారని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. బుధవారం స్థానిక మాధురి ఫంక్షన్‌హాల్‌లో 56 మందికి షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12 మంది లబ్ధిదారులకు పెళ్లి కానుకగా రూ.95 కోట్లు అందించామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని పండుగలను గౌరవిస్తూ దుస్తులు పంపిణీ చేసిందన్నారు. సత్తుపల్లి, కల్లూరు, వేంసూరు మండలాలకు షాదీఖానాల నిర్మాణం కోసం రూ.3.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. అనంతరం మండలంలోని బుగ్గపాడు, పాకలగూడెం ప్రాథమిక పాఠశాలలో మన ఊరు – మన బడి కింద సుందరంగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె.సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఎంపీడీఓ సీహెచ్ సుభాషిణి, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఆత్మచైర్మన్ హరికృష్ణారెడ్డి, ఎంపీపీ హైమావతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ రామారావు పాల్గొన్నారు.

ఏసీపీ వెంకటేష్ సేవలు అభినందనీయం..

సత్తుపల్లిటౌన్: శాంతిభద్రతల పరిరక్షణలో కల్లూరు ఏసీపీ ఎన్.వెంకటేష్ అందించిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కొనియాడారు. బదిలీపై పాల్వంచ వెళ్తున్న ఏసీపీని బుధవారం సత్తుపల్లిలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు ఉమా, కూసంపూడి రామారావు, ఎస్‌కే రఫీ, చల్లగుండ్ల కృష్ణయ్య, మట్టా ప్రసాద్, కృష్ణారావు, దొడ్డా శంకర్ రావు, పసుమర్తి చంద్రరావు, ఎస్‌కే ఛాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ముదిగొండ: మండలంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందని తెలిపారు. ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జెడ్పీటీసీ పి దుర్గ, నాయకులు మీగడ శ్రీనివాస్‌యాదవ్, వెంకట్‌గౌడ్, రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం

మధిర: పట్టణంలోని వైరా నది సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమైయ్యాయి. ఈ నెల 5న ఆలయంలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించనున్న సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, రుత్విక్ హరణం, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, శాలా సంస్కరణ, అఖండ దీపారాధన తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు దంపతులు పీటలపై కూర్చున్నారు.

ఘనంగా ఎంపీపీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ బీరవెల్లి రఘు

కల్లూరు రూరల్: కల్లూరు ఎంపీపీ బీరవెల్లి రఘు జన్మదిన వేడుకలు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీకి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కట్టా అజయ్‌కుమార్, ఎంపీడీఓ రవికుమార్, లక్కినేని రఘు, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్, కె.ప్రసాద్, వెంకటరత్నం, కృష్ణ, వెంకటరెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరంలోని వీవీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల పది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ జయలక్ష్మి, ఎంపీటీసీ కృష్ణారావు, కోటేశ్వరరావు, పూర్ణచంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి, కృష్ణారావు, వెంకటేశ్వరరావు, బహుదూర్‌ఖాన్, రామారావు, వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డిలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కవిత, ఎస్‌ఎంసీ చైర్మన్ లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, పేరం మల్లేశ్వరరావు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.

బస్సును ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

పెనుబల్లి : ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొన్న ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. సత్తుపల్లి డిపో ఆర్టీసీ బస్సు బుధవారం పెనుబల్లి మండలం రామచందర్ రావు బంజర్ వద్ద రహదారిపై ఆగింది. ఆ మార్గంలో ద్విచక్రవాహనంపై వస్తున్న తల్లాడ మండలం ముద్దునూరుకు ఇనుపనూరి రత్నబాబు వెనుక నుంచి ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనకు పెనుబల్లిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

సీఎండీ ప్రకటన ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా: విద్యుత్‌పై జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావు విడుదల చేసిన ప్రకటన భేషరతుగాఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో నిర్వహించిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుగాలం శ్రమిస్తున్న రైతులకు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయకుండా మోటార్లు, ఆటో స్టార్టర్లు తీసివేయాలని బెదిరింపు ప్రకటనలు చేయడం సరైంది కాదన్నారు. గత 8 ఏళ్ల నుంచి రైతులకు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తూ ప్రభుత్వం ఘనసీయమైన ప్రగతి సాధిస్తుంటే.. గత 15 రోజుల నుంచి నిరంతర విద్యుత్ కోతలతో రైతుల పంటలు ఎండిపోయే స్థితికి చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బొంతు సమత, మండడపు రామారావు, షేక్.జమాల్, నరికొండ అమరేంద్ర, శీలం నారాయణరెడ్డి, వడ్లమూడి మధు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను, ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించం



ఏన్కూరు: మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్

ఏన్కూరు/ఎర్రుపాలెం: సీఎంను, బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించేది లేదని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాణోత్ సురేష్ నాయక్, మండల కమిటీ అధ్యక్షుడు పంబి సాంబశివరావు అన్నారు. ఏన్కూరులోని స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివిధ సమ్మేళనాల పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని సీఎం కేసీఆర్, కేటీఆర్‌లను విమర్శిస్తున్నారని తెలిపారు. జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌ను ఆయనే పార్టీలోకి తెచ్చి అతను ప్రజాదరణ లేని నాయకుడని ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు భూక్యా లాలు, మేడ ధర్మారావు, చీరాల నర్సింహారావు, పూర్ణకంటి మైసారావు, భూక్యా శివ, భూక్య బాలాజీ, షేక్ బాజీ, గిద్దగిరి సత్యనారాయణ, ఈపూరి సైదులు, గణేష్, ఎంపీపీ దేవరకొండ శిరీష, ఎంపీటీసీలు షేక్ మస్తాన్‌వలీ, సగ్గుర్తి కిషోర్, నాయకులు యన్నం శ్రీనివాసరెడ్డి, దేవరకొండ చిరంజీవి, కామిశెట్టి పవన్‌కుమార్, దేవరకొండ రవి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టొద్దు..

కారేపల్లి: ప్రభుత్వంపై, జిల్లా అధ్యక్షుడు తాతా మధుపై సోషల్ మీడియాలో అనుచితంగా పోస్టింగ్‌లు పెడితే సహించేది లేదని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఉమాశంకర్, ఎంపీపీ శకుతల, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావులు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బీఆర్‌ఎస్‌లోనే ఉంటూ.. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తుల పై చర్యలు తప్పవన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు పింఛన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

చింతకాని: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముదాం శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల మహాసభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అసెంబ్లీలో కార్మికులకు లక్ష మోటార్ సైకిళ్లను ఇస్తామని ప్రకటించి 9 నెలల గడిచినా నేటివరకు ఇవ్వలేదన్నారు. 55 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులందరికీ నెలకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వేల్పుల నరేష్, కార్యదర్శిగా పానుగోటి రాములను ఎన్నుకున్నారు. ఈ సభలో బిల్డింగ్ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు గోపాలరావు, మండల కన్వీనర్ రమణ, కందరబోయిన కొండలరావు, భిక్షం, సత్యనారాయణ, దామాల ఆదామ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో పండుగలా వ్యవసాయం

- వైవిధ్యమైన పంటలు పండించేలా కృషి
- రాష్ట్ర మంత్రులు సింగిరెడ్డి, పువ్వాడ



మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, పక్కన మంత్రి అజయ్‌కుమార్, ప్రజాప్రతినిధులు

ముదిగొండ: తెలంగాణలో నేడు వ్యవసాయం పండగైందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మాధాపురంలో రూ.22లక్షల వ్యయంతో నిర్మించిన రైతు వేదికను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి సింగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయమంటే దండగ అన్న భావన నుంచి పండుగలా మార్చిన ఘనత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఖమ్మం జిల్లాలో పండించే పంటలు మరెక్కడా కూడా పండించరని, వ్యవసాయంలో మ్యూజియంలా ఉందని కొనియాడారు. భూమిని బీడుగా ఉంచొద్దని కేసీఆర్ లక్ష్యం.. ఈ క్రమంలోనే రైతు సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. ఇటీవల తమ సోదరుడు పొంగులేటి కరెంటు ఎక్కడా అంటూ ప్రశ్నించడం ఆశ్చర్యంగా ఉందని చెప్పారు. గత పాలకులు ఎవరైనా నిరంతరం విద్యుత్ ఇచ్చారా అని ప్రశ్నించారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులకు రైతుబంధు, రైతుబీమా, నిరంతర విద్యుత్ అమలుచేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అనంతరం మాధాపురం సర్పంచ్ యరబోలు వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ యరబోలు పిచ్చెమ్మ, వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు ఎస్.కే.జమాల్ తదితరులు పలు సమస్యలపై మంత్రులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జెడ్పీచైర్మన్ కమల్‌రాజు, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపులేటి దుర్గతో పాటు పోట్ల ప్రసాద్, తుపాకుల యలగొండస్వామి, సామినేని వెంకటయ్య, మీగడ శ్రీనివాస్‌యాదవ్, బత్తుల వీరారెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క – సారలమ్మ జాతర ప్రారంభం



సమ్మక్క- సారక్క గద్దెలను దర్శించుకుంటున్న వైరా ఎమ్మెల్యే రాములు నాయక్

కారేపల్లి: మండలంలోని కోయగుంపు గ్రామంలో వెలసిన సమ్మక్క – సారక్క గద్దెల వద్ద మూడు రోజుల పాటు జరిగే జాతరను ఎమ్మెల్యే రాములు నాయక్ ప్రారంభించారు. అనంతరం గద్దెలను దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యేను కోయగుంపు గ్రామస్తులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదివాసీలతో కలిసి నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు శకుంతల, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఉమాశంకర్, నాయకులు ఐలయ్య, వీరన్న, పుల్లారావు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, అచ్చయ్య, నరేష్, షఫీ, రాము, రఘు, రమేష్, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ మంగీలాల్, సర్పంచ్‌లు సత్యనారాయణ, కుమార్, రంగారావు, సక్రాం, ఆదినారాయణ, ఎంపీటీసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ మృతికి ఎమ్మెల్యే నివాళి..

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెంకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త తెల్లబోయిన కృష్ణ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ కృష్ణ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కవిత, బీఆర్‌ఎస్ నాయకులు చిరంజీవి, శ్రీనివాసరావు, రవి, కృష్ణ, మాధవరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి పూజలు



సత్తుపల్లి ఆలయంలో భీష్మ ఏకాదశి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గీతాజ్ఞాన మందిరంలోని శ్రీపార్థసారధిస్వామి ఆలయంలో బుధవారం భీష్మ ఏకాదశి సందర్భంగా శ్రీవిష్ణుసహస్రనామ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ప్రవచనకర్త నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య స్వామి శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రం పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందపాటి కేశవరెడ్డి, గుడివాడ వెంకటేశ్వరరావు, బాలా లీలాకృష్ణ, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, పురుషోత్తంరావు, శంకర్‌రావు, శివకుమార్, కొత్తూరు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలో బుధవారం భీష్మ ఏకాదశి సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వర ఆలయం, అంజనాపురం ఆంజనేయ దేవాలయం, శివాలయం, కలకొడిమ కోదండ రామాలయం, శివాలయం, కుర్నవల్లి అయ్యప్ప దేవాలయం, వేంకటాచలపతి దేవాలయం, నారాయణపురం కోదండ రామాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు.

వినతుల వెల్లువ..

భట్టికి..

మధిర: రెండో ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని సెకండ్ ఏఎన్ఎం యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షురాలు బడేటి వనజ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మధిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండో ఏఎన్ఎంలను రెగ్యులరైజేషన్ చేసే విషయం గురించి అసెంబ్లీలో ప్రస్తావించి, ముఖ్యమంత్రితో చర్చించి తమ సమస్యను పరిష్కరించాలన్నారు.

హెచ్‌ఎంలకు..

చింతకాని: పండిట్, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పండిట్, పీఈటీలకు పదోన్నతిలో జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ బుధవారం సహాయ నిరాకరణ ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదోన్నతులు కల్పించే వరకు సహాయ నిరాకరణ ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వినతిపత్రాలు అందజేశారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో బుధవారం ఫిజియోథెరపీ వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, సీఆర్పీ తిరపయ్య, భవిత కేంద్రం సంరక్షురాలు అరికొట్ల లలితకుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం

మధిర: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం అని బీఆర్‌ఎస్ నాయకుడు మొండితోక జయాకర్ అన్నారు. మధిర పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవుల కోసమే పార్టీ మారుతున్నాడని ఎమ్మెల్సీ తాతా మధుపై డాక్టర్ కోట రాంబాబు విమర్శలు చేస్తున్నాడని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కృష్ణప్రసాద్, భాస్కర్ రెడ్డి, అప్పారావు ఉన్నారు.

భూమి పూజ

మధిర: చిలుకూరులో గ్రామ టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మధిర పట్టణ, మండలాధ్యక్షుడు హనుమంతరావు, పుల్లారావు, కృష్ణారావు, బెంజిమెన్, రత్నకుమారి, మోహన్ కుమార్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏన్కూరు: స్థానిక గురుకుల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు సాంఘీకశాస్త్రం ఇంగ్లీష్ మీడియంలో బోధించుటకు ఉపాధ్యాయులు కావాలని ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ బీఈడీ పూర్తి చేసి అనుభవం కలిగిన ఉపాధ్యాయులు కావాలని కోరారు. మిగతా వివరాల కోసం 9701222080 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఘనంగా రక్షణగిరి పుణ్యక్షేత్రం ఉత్సవాలు



అయ్యవారిగూడెంలో ఉత్సవాల పతాకాన్ని ఆవిష్కరిస్తున్న గురువులు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలో రక్షణగిరి పుణ్యక్షేత్రం ఉత్సవాలు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. తొలిరోజు రక్షణగిరి మేరిమాత స్వరూపంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఖమ్మం మేత్రాసన గురువులు కొర్లపాటి జోజి, గుండూ జ్ఞానేష్, గోవా శౌరి, స్థానిక రక్షణగిరి ఫాదర్ సూరేపల్లి ఐజీలు ఉత్సవాల పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వజనులకు రక్షణగిరి పుణ్యక్షేత్రం స్వర్గదామంగా ఉందన్నారు. క్రీస్తు గొప్పతనాన్ని వివరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దివ్యబలి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ ఐజాక్, సర్పంచ్ గోసు రామారావు, పలు గ్రామాల సంఘస్తులు పాల్గొన్నారు.